నమస్తే తెలంగాణ

జోగుళాంబ గద్వాల
వనపర్తి

5 | మహబూబ్‌నగర్, శుక్రవారం 5 జనవరి 2024 | JOGULAMBA GADWAL WANAPARTHY




ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

# ప్రజలకు ఇబ్బందులు రానీయొద్దు

- అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

ఇటిక్యాల, జనవరి 4 : ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే విజయుడు సూచించారు. మండలంలోని మునుగాల, చాగాపురం గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించారు. మునుగాలలో దరఖాస్తుల ప్రక్రియను ఎమ్మెల్యే పరిశీలించి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు సందేహాలు ఉంటే ఓపికతో చెప్పి దరఖాస్తుల స్వీకరణ సజావుగా సాగేలా చూడాలన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ వెంకటేశ్వర్లు, సర్పంచ్ విజయలక్ష్మి, జెడ్పీటీసీ హన్మంత్‌రెడ్డి, నాయకులు లక్ష్మీనారాయణ రెడ్డి, నల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

***అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలి..***

మానవపాడు, జనవరి 4 : ఆరు గ్యారెంటీల పథకాలు పొందేందుకు అర్హులైన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని తాసీల్దార్ జుబేర్ మైనోద్దీన్‌కు ఎమ్మెల్యే విజయుడు సూచించారు. మండలంలోని పల్లెపాడులో నిర్వహించిన ప్రజాపాలనలో దరఖాస్తులను ఎమ్మెల్యే స్వీకరించారు. పల్లెపాడులో 612, కొర్విపాడులో 676, చండూరులో 295 దరఖాస్తులు వచ్చాయని ఎంపీడీవో రమణారావు తెలిపారు.



బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# బ్రహ్మోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

గద్వాల, జనవరి 4 : గట్టు మండలం మాచర్లలో వెలసిన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల బ్రోచర్‌ను జిల్లా కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ నెల 5 నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని సర్పంచ్‌తోపాటు ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నిర్వాహకులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధి రామప్ప, వైస్ ఎంపీపీ రామకృష్ణ, నాయకులు ఆనంద్, శేఖర్‌రెడ్డి, పవన్‌రెడ్డి తదితరులున్నారు.




నాగర్‌కర్నూల్ అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

# ఉచిత ప్రయాణంతో ఉపాధి కరువు

- ఆటో కార్మికులు అవస్థలు పడుతున్నరు
- ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలి
- పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య

నాగర్‌కర్నూల్, జనవరి 4 : రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు ఉచిత ప్రయాణం కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించడంతో రవాణా రంగంపై ఆధారపడి జీవిస్తున్న 50లక్షల మంది కార్మికులు రోడ్డున పడ్డారని, వారిని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరమున్నదని పబ్లిక్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆటో కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా రవాణారంగంపై 50లక్షల మంది కార్మికులు ఆధారపడి జీవిస్తున్నారని, వారి సంక్షేమం గురించి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమన్నారు. ప్రమాద బీమా రూ.10లక్షలు ఇవ్వాలన్నారు. ఆటోలు, ఇతర రవాణారంగ వాహనాలను ఫైనాన్స్‌లో తీసుకొచ్చి వాటిని నడుపుతూ జీవనం సాగించేవారన్నారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత ప్రయాణం చేయడంతో ఫైనాన్స్ కట్టలేక వాహనాలను అప్పు ఇచ్చినవారు తీసుకెళ్తుండగా, కుటుంబాలు పూట గడవక రోడ్డుపాలవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 2019 మోటరు వాహన చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం యూనియన్లతో చర్చలు జరిపి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ పబ్లిక్, ప్రైవేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కురుమూర్తి, ఉపాధ్యక్షుడు శివ, సైదులు, ఖాజా, దేవేందర్, సుధాకర్, రాజు, శ్రీను పాల్గొన్నారు.

# పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదల

పాలమూరు, జనవరి 4 : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు డీఈవో రవీందర్ తెలిపారు. ఈ మేరకు పరీక్షల షెడ్యూల్ ప్రభుత్వం నుంచి వెలువడిందని, ఇందుకు అనుగుణంగా విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

***పరీక్షల షెడ్యూల్ ఇలా..***

| తేదీ | పేపర్ | సమయం |
|---|---|---|
| 18-03-2024 | మొదటి భాష | ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు |
| 19-03-2024 | రెండో భాష | ఉదయం 9:30 నుంచి 12:30 వరకు |
| 21-03-2024 | మూడో భాష | ఉదయం 9:30 నుంచి 12:30 వరకు |
| 23-03-2024 | గణిత శాస్త్రం | ఉదయం 9:30 నుంచి 12:30 వరకు |
| 26-03-2024 | భౌతిక రసాయన శాస్త్రం పేపర్-1 | ఉదయం 9:30 నుంచి 11:00 వరకు |
| 28-03-2024 | జీవశాస్త్రం పేపర్-2 | ఉదయం 9:30 నుంచి 11:00 వరకు |
| 30-03-2024 | సాంఘిక శాస్త్రం | ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు |
| 01-04-2024 | సంస్కృతం/అరబిక్ పేపర్-1/ఒకేషనల్ | ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు |
| 02-04-2024 | సంస్కృతం/అరబిక్ పేపర్-2 | ఉదయం 9:30 గంటల నుంచి 12:30 వరకు |

# పోమాల సర్పంచ్ సస్పెన్షన్

- ఉత్తర్వులు జారీ చేసిన మహబూబ్‌నగర్ కలెక్టర్ రవినాయక్

నవాబ్‌పేట, జనవరి 4 : మండలంలోని పోమాల సర్పంచ్ కొండనోళ్ల కృష్ణయ్యను పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో భద్రునాయక్ గురువారం తెలిపారు. సర్పంచ్ కృష్ణయ్య గతంలో జీపీ నిధులను దుర్వినియోగం చేశాడని ఏడాది కిందట అదే గ్రామానికి చెందిన యువకులు డీపీవోకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. యువకుల ఫిర్యాదుతో అప్పట్లో డీఎల్‌పీవోతో విచారణ చేయించగా, నిధులు దుర్వినియోగమైనట్లు తేలిందన్నారు. నిధులు రికవరీ అయ్యే వరకు అతడిని గతంలోనే ఆరునెలలపాటు సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం సర్పంచ్ కృష్ణయ్య హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకొని పదవిలో కొనసాగారన్నారు. దుర్వినియోగానికి గురైన రూ.30లక్షల 16,353 నిధులను రికవరీ చేయాలని అధికారులు ఆదేశించినా ఇవ్వకపోవడంతో పదవి నుంచి తొలగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. కాగా, సర్పంచుల పదవీ కాలం ముగిసేందుకు కేవలం 25 రోజులు మాత్రమే మిగిలి ఉండగా, సర్పంచ్‌ను పదవి నుంచి తొలగించడం మండలంలో చర్చనీయాంశంగా మారింది.

# విద్య, వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ

- ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదు
- జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సంతోష్

గద్వాల, జనవరి 4 : జిల్లాలో విద్యా, వైద్యం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరమున్నదని జోగుళాంబ గద్వాల కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న అనంతరం మీడియాతో మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ జిల్లాను అభివృద్ధి పథంలోకి తీసుకెళ్తామన్నారు. అధికారులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలన్నారు. ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేకదృష్టి పెట్టి వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని, లేదంటే చర్యలు తప్పవన్నారు.



ఆయిల్‌పాం తోటలో అంతరపంట సాగు చేసిన రైతన్న

# ఆయిల్‌పాం.. బెస్ట్ ఫాం

- రైతులకు వరం.. ఆయిల్‌పాం సాగు
- పెట్టుబడి తక్కువ.. ఆదాయం ఎక్కువ
- ఒక్కో మొక్కకు రూ.173 రాయితీ
- మూడు నుంచి ముప్పై ఏండ్ల వరకు ఆదాయం
- జోగుళాంబ గద్వాలలో 5,925 ఎకరాల్లో సాగు
- కేసీఆర్ సర్కార్ ప్రోత్సాహంతో రైతుల ఆసక్తి

***జోగుళాంబ గద్వాల జిల్లాలో సాగు ఇలా..***

2021లో ఆయిల్‌పాం పంటను 68 మంది రైతులు 250 ఎకరాల్లో సాగు చేశారు. 2021-22 జిల్లాలో 356 మంది రైతులు 1,479.62 ఎకరాల్లో సాగు చేశారు. జిల్లాలో ఆయిల్‌పాం సాగు ప్రోత్సహించే ఉద్దేశంతో 2022-2023 సంవత్సరానికిగానూ 712 మంది రైతులు 2,857 ఎకరాల్లో, 2023-2024లో 355 మంది రైతులు 1,338 ఎకరాల్లో పంటను సాగు చేశారు. జిల్లాలో ఏటా ఆయిల్‌పాం సాగు పెరుగుతూ వస్తున్నది. ఉద్యానవన, పట్టుపరిశ్రమల శాఖలు ప్రత్యేక శ్రద్ధ వహించడంతో ఈ లక్ష్యం సాధించే దిశగా ముందుకు సాగుతున్నారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ క్షేత్రస్థాయి సిబ్బంది, డ్రిప్ కంపెనీల సహకారంతో ఇప్పటి వరకు జిల్లాలో మొత్తం 1,491 మంది రైతులకు చెందిన 5,925 ఎకరాల్లో ఈ పంటను సాగు చేశారు.

గద్వాల, జనవరి 4 : రైతులకు దీర్ఘకాలికంగా ఆదాయం అందించే ఆయిల్ పాం సాగుపై కేసీఆర్ సర్కార్ దృష్టి సారించగా ప్రస్తుతం అది రైతులకు లాభాలు తెచ్చే పంటగా మారింది. జిల్లాలో ఆయిల్‌పాం సాగు చేసిన వారికి పెట్టుబడి తక్కువ ఆదాయం ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంత రైతులంతా ఆయిల్‌పాం పంటలను సాగుచేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం గతంలో పైలట్ ప్రాజెక్టు కింద జోగుళాంబ గద్వాల జిల్లాను ఎంపిక చేసి ఆయిల్‌పాం సాగు చేపట్టి రైతులకు మొక్కలు నాటి నుంచి నుంచి అనేక సబ్సిడీలు అందించి వారిని ప్రోత్సహిస్తూ వచ్చింది. అధికారులు ఈ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తుండగా.. మరోవైపు వంట నూనెల డిమాండ్ పెరుగుతున్న తరుణంలో మన రాష్ట్రంలో ఆయిల్‌పాం సాగు పెరిగితే విదేశాలపై ఆధారపడడం తగ్గడంతోపాటు మనకు సరసమైన ధరలకు వంట నూనెలు దొరికే అవకాశం ఉన్నది. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఆలోచనతో ఇతర పంటలకు బదులు ఈ పంటలపై రైతులు ఆసక్తి పెంచుకునే విధంగా గతంలో కేసీఆర్ సర్కార్ చర్యలు తీసుకున్నది. ఆయిల్‌పాం సాగుతో ఇండోనేషియా, మలేషియా దేశాలు ఆర్థికంగా అభివృద్ధి చెందాయి. అలాగే రాష్ట్రం ఆర్థికంగా అభివృద్ధి చెందడంతోపాటు రైతులకు దీర్ఘకాలంగా లాభాలు తెచ్చే పంట కావడంతో రైతులు కూడా దీని సాగుపై మక్కువ ప్రదర్శిస్తున్నారు.

***కేసీఆర్ ప్రభుత్వ ప్రోత్సాహంతోనే..***

ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందించడంతో జిల్లాలో రైతులు ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ఎకరా పొలంలో 57 మొక్కలు నాటవచ్చు. ఒక మొక్క ధర రూ.193 కాగా, కేసీఆర్ ప్రభుత్వం రూ.173 రాయితీ ఇచ్చింది. రైతు మొక్కకు రూ.20 చొప్పున చెల్లిస్తే చాలు మొక్కలు అందిస్తుంది. ప్రభుత్వం ఏటా రూ.4,200 చొప్పున నాలుగేండ్లపాటు ప్రోత్సాహం అందిస్తుంది. మొక్కల కోసం దరఖాస్తు చేసుకున్న రైతుల పొలాల వద్దకు డ్రిప్ సిబ్బంది వచ్చి సర్వే చేసి ఆ తర్వాత డ్రిప్ సౌకర్యం కల్పిస్తున్నారు. కేంద్రం కూడా ఆయిల్‌పాం సాగు చేసే రైతులకు మిషన్ ఫర్ ఆయిల్ సీడ్ అండ్ ఆయిల్ పాం పాలసీ తీసుకొచ్చింది. దీనిద్వారా రైతులకు చేయూతనిస్తుండడం, రాష్ట్ర ప్రభుత్వానికి తోడు కేంద్రం నిధులు కూడా రైతులకు అందనున్నాయి. ప్రభుత్వం ఇస్తున్న చేయూతతో రైతులు సాగుపై ఆసక్తి చూపడంతో అనుకున్న లక్ష్యానికి చేరువలో అధికారులు ఉన్నారు.

***ఆయిల్‌పాం సాగు విధానం..***



- త్రిభుజాకారంలో 9 మీటర్ల దూరంలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలి.
- 12 నుంచి 18 నెలల మొక్కలను నాటాల్సి ఉంటుంది.
- ఇలా నాటితేనే ఎకరాకు 57 నుంచి 67 మొక్కలు నాటే అవకాశం ఉన్నది.
- ఒక్కో రోజు ప్రతి మొక్కకూ 150 నుంచి 200 లీటర్ల వరకు నీరందించాలి.
- ఆయిల్‌పాం పంట మూడు నుంచి నాలుగేండ్ల లోపు చేతికి వస్తుంది.
- 30 ఏండ్ల వరకు దిగుబడి ఉంటుంది.
- మూడేండ్ల సాగు సమయంలో అంతర్ పంటలు కూడా వేసుకోవచ్చు.
- పంట 4వ ఏడాది నుంచి ఏడేండ్ల వరకు ఎకరాకు 10 నుంచి 12 టన్నులు, 7 నుంచి 30 ఏండ్ల వరకు 12 నుంచి 15 టన్నుల దిగుబడి వస్తుంది.

***ఆయిల్‌పాం సాగు.. లాభాలు బాగు..***

రైతులు ఆయిల్‌పాం సాగులో లాభాలు బాగా ఆర్జించొచ్చని ఉద్యానవన శాఖ అధికారులు చెబుతున్నారు. ఆయిల్‌పాం సాగులో మూడేండ్ల వరకు అంతర్ పంటలు సాగు చేసుకోవడానికి అవకాశం ఉండడంతో రైతులు ఈ పంటను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఈ మొక్క నాటిన తర్వాత నాలుగో ఏడాది నుంచి కాపు మొదలై సుమారు 30 ఏండ్లపాటు నిరంతరం ఆదాయం పొందవచ్చు. మొదటి మూడేండ్ల పాటు అంతర పంటగా పత్తి, మిరప, వేరుశనగ, అరటి, బొప్పాయి, కూరగాయలు వంటి పంటలు సాగు చేసుకోవచ్చు. ఈ చెట్టు 15 మీటర్ల వరకు ఎత్తు పెరిగే అవకాశం ఉంది. ఈ పంటలకు తెగుళ్లు, చీడపీడల పురుగుల బెడద తక్కువగా ఉంటుంది. అంతర్ పంటలు సాగు చేసుకునే రైతులకు రూ.2100 ప్రభుత్వం ప్రోత్సాహకం అందిస్తుంది. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడంతోపాటు అడవి పందుల బెడద ఉండదు. మూడేండ్ల తర్వాత ఎకరాకు 3 నుంచి నాలుగు టన్నుల దిగుబడి వస్తుంది. ఏడాదికి ఏడాది దిగుబడి పెరుగుతూ ఏడు సంవత్సరాల తర్వాత ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇక్కడ రైతులు పండించిన పంటను అశ్వారావుపేట మార్కెట్‌కు తరలిస్తున్నారు.



జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి అశ్వారావుపేటకు ఆయిల్‌పాం గెలలను తరలిస్తున్న రైతులు

# ప్రజాకాంక్షకు అనుగుణంగా పరిపాలన

- అవినీతిని అంతమొందించేందుకు పటిష్ట చర్యలు
- వేసవిలో తాగునీటికి ఇబ్బందులు రానీయొద్దు
- నెలాఖరులోగా కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలి
- ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు
- అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం
- హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్, ఎంపీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్‌కర్నూల్, జనవరి 4 : ఎంతో మంది ప్రాణత్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పారదర్శకమైన, అవినీతి రహిత పాలన అందించడమే ప్రభుత్వ ధ్యేయమని ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో జెడ్పీ చైర్మన్ శాంతకుమారి, ఎంపీ రాములు, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్సీలు కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, గోరటి వెంకన్న, కలెక్టర్ ఉదయ్‌కుమార్‌తోపాటు జిల్లాలోని అన్నిశాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలు మమ్మల్ని నమ్మి అధికారాన్ని కట్టబెట్టారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఎన్నో పోరాటాలు, అమరుల త్యాగాలతో ఏర్పడిన రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామన్నారు. అధికారులు పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుంటూ ప్రజల సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధిలో నాగర్‌కర్నూల్ జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపి, నూతన ఒరవడికి నాంది పలుకుదామని పిలుపునిచ్చారు.

***శాఖల వారీగా సమీక్ష..***

సమావేశంలో ఆయా శాఖల వారీగా మంత్రి సమీక్ష నిర్వహించారు. మిషన్ భగీరథ, ఇరిగేషన్, పౌర సరఫరాలు, పంచాయతీరాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలపై సమీక్షించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రూ.41వేల కోట్ల నిధులతో గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం చేపట్టిందని, ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తాగునీరు అందించాలన్నారు. వారం రోజుల్లో తాగునీటి సరఫరాపై నివేదికలు అందజేయాలని కలెక్టర్‌ను ఆదేశించారు. ఆవాసాలకు తాగునీరు సరఫరా అవుతుందా లేదా అనేది స్థానిక ప్రజాప్రతినిధులతోపాటు గ్రామ మహిళా సమాఖ్య సంతకాలు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు. మహిళల సంతకం లేకుండా బిల్లులను జనరేట్ చేయడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అనంతరం పీఆర్‌ఎల్‌ఐ, ఎంజీకేఎల్‌ఐ పథకాలపై సమీక్ష నిర్వహించారు. పూర్తి వివరాలు సిద్ధం చేసి నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పౌర సరఫరాల శాఖ వివరాలను సిద్ధం చేయాలని తెలిపారు.

***ఆరుగ్యారెంటీలు అమలు చేస్తాం..***

హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని, రూ.500 గ్యాస్ పంపిణీ కోసం కసరత్తు ముమ్మరం చేసిందని, గ్యాస్ కనెక్షన్లపై అధికారులు పూర్తి వివరాలను సేకరించాలన్నారు. ఎంతమందికి గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి, కొత్తగా ఎన్ని ఇవ్వాలో సమగ్ర సమాచారం అందించాలన్నారు. నెలాఖరులోగా కొత్త గ్యాస్ కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, గిరిజన, సాంఘిక సంక్షేమ శాఖలపై సైతం సమీక్ష నిర్వహించి శాఖల వారీగా సమీక్ష నిర్వహిస్తామన్నారు. అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ అచ్చంపేట నియోజకవర్గంలోని గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించాలన్నారు. సాగునీటి కోసం పీఆర్‌ఎల్‌ఐ కింద నార్లాపూర్ నుంచి నీరు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులను కోరారు. క్వాలిటీ కంట్రోల్ ధ్రువీకరణ, ఇంజినీరింగ్ అధికారుల పరిశీలన లేకుండా బిల్లులు చెల్లించవద్దని సూచించారు. అచ్చంపేట వంద పడకల దవాఖానలో సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. డయాలిసిస్, సెంట్రల్ ఆక్సిజన్ యూనిట్ల కోసం ప్రతిపాదనలు పంపించాలన్నారు. సమావేశంలో ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్, లోకల్ బాడీస్ అదనపు కలెక్టర్ కుమార్‌దీపక్, అదనపు కలెక్టర్ రెవెన్యూ సీతారామరావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, అధికారులు పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ చాటాలి

- ఎస్‌జీఎఫ్ సెక్రటరీ రమేశ్‌బాబు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రమేశ్‌బాబు

మహబూబ్‌నగర్‌టౌన్, జనవరి 4 : క్రీడల్లో ప్రతిభ చాటి క్రీడాకారులు రాణించాలని జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-17 సెక్రటరీ రమేశ్‌బాబు అన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక స్టేడియంలో ఉమ్మడి జిల్లా అండర్-14 బాల,బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. రమేశ్‌బాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవలేదని, ఎంతోమంది రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించారని అన్నారు. టోర్నీ క్రీడాకారులు ప్రతిభతో జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో కోచ్ సాధిక్‌అలీ వ్యాయామ ఉపాధ్యాయులు వేణుగోపాల్, నాగరాజు, రాఘవేందర్, మేరిప్పు, వెంకట్, నాగమణి, ఫక్రుద్దీన్, కపిల్, ఉదయ్ పాల్గొన్నారు.

# కందులు @ రూ.8,509

జడ్చర్ల, జనవరి 4 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కందులకు అత్యధికంగా క్వింటా రూ.8,509 ధర పలికింది. గురువారం బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు కంది, ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, ఉలువలు అమ్మకానికి వచ్చాయి. మార్కెట్‌కు 227 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,509, కనిష్ఠంగా రూ.8,009, మధ్యస్తంగా రూ.8,509 ధర పలికింది. అలాగే 285 క్వింటాళ్ల ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యం అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.3,122, కనిష్ఠంగా రూ.2,789, మధ్యస్తంగా రూ.3,001 ధర పలికింది. 74 క్వింటాళ్ల మొక్కజొన్న అమ్మకానికి రాగా, క్వింటా గరిష్ఠంగా రూ.2,260, కనిష్ఠంగా రూ.2,100, మధ్యస్తంగా రూ.2,260 ధర పలికింది. 38 క్వింటాళ్ల హంసధాన్యం అమ్మకానికి రాగా, గరిష్ఠంగా రూ.1,927 పలికింది. రెండు క్వింటాళ్ల ఉలువలు అమ్మకానికి రాగా, గరిష్ఠంగా రూ.6,519 లభించింది. 593 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.8,182 ధర పలికింది.